# యాజమాన్య పద్ధతులే తెగుళ్ల నివారణకు దోహదం

- వరిలో అధికంగా పాము పొడ, సుడి దోమ వ్యాప్తి
- ఎప్పటికప్పుడు గుర్తించాలని వ్యవసాయ అధికారుల సూచన

దస్తురాబాద్, అక్టోబర్ 30: వరి పంటలో చీడ పీడల పోషక లోపాల ప్రభావం చాలా అధికంగా ఉంటుంది. రైతులు వరి పంటలో పురుగులు,తెగుళ్లు పోషక లోపాల లక్షణాలను ఎప్పటికప్పుడు గుర్తించి, సరైన నివారణ చర్యలు చేపట్టడం ఎంతైనా అవసరం ఉంది. పంట దిగుబడి కోసం విచక్షణ రహితంగా సస్యరక్షణ మందులు, ఎరువులను వాడడం వలన తక్కువ స్థాయిలో ఆశించే చీడపీడలు ఉధృతమయ్యే అవకాశం ఉంది. అందుకు అనుగుణంగా సమగ్ర సస్యరక్షణ పద్ధతులను పాటించాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం వరి పంటలో పాము పొడ, సుడి దోమ తెగుళ్ల వ్యాప్తి తీవ్రంగా ఉందని, రైతులు గమనించి సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

**పాము పొడ తెగులు లక్షణాలు..**

రైజోక్టోనియా సొలని అనే శిలీంధ్రం ద్వారా ఇది వ్యాప్తి చెందుతుంది. సామాన్యంగా వరి పిలకలు పెట్టే దశ నుంచి ఎప్పుడైన ఈ తెగులు ఆశించవచ్చు. పాము పొడ కూడా ఒంటి మచ్చలుగా మారుతాయి. ఈ తెగులు పిలకలు పెట్టే దశ,వెన్ను పైకి తీయు దశలో వస్తుంది. వరి మొక్కలు వెన్నెలు పైకి తీయు దశలో ఆకులపై మచ్చలు ఒక దానితో ఒకటి కలిసి పోయి ఆకులు ఎండిపోతాయి. ఈ మచ్చల చుట్టూ గోధుమ వర్ణం కల్గి మధ్య భాగం బూడిద రంగులో ఉంటుంది. వరి మొక్కలు పిలకలు పెట్టే దశలో సాగినప్పటికీ వెన్ను దశలో పై ఆకులు ఎండిపోతాయి.ఏర్పడిన మచ్చలపై ఆవగింజ పరిమాణంలో ఈ నల్లటి శిలీంధ్ర బీజాలు ఉత్పత్తి చేస్తాయి.



వరి పంటలను పరిశీలిస్తున్న ఏఈవో కిరణ్

**వ్యాప్తి..**

వరి పైరు కోసే సమయంలో ఈ బీజాలు కొన్ని రాలిపోయి మరికొన్ని ధాన్యంతో కూడా కలుస్తాయి. ప్రవాహం ద్వారా మొక్కలపై గాక చాలా రకాల గడ్డిజాతి కలుపు మొక్కలపై కూడా వృద్ధి చెందుతుంది. వాతావరణంలో ఉష్ణోగ్రత 23–35 సెంటీ గ్రేడ్ మధ్య ఉన్నప్పుడు, నాట్లు దగ్గర దగ్గరగా, అధిక నత్రజని ఎరువులు వేసినప్పుడు ఈ తెగులు అధికంగా వృద్ధి చెందుతుంది.

**నివారణ..**

మంచి విత్తనాన్ని ఎన్నుకొని 2 నుంచి 3 గ్రాముల మ్యారికో జెబ్ కిలో విత్తనానికి కలిపి శుద్ధి చేయాలి. గట్లపై కలుపు లేకుండా చూసుకోవాలి. నత్రజని ఉన్న ఎరువును రెండు నుంచి మూడు దఫాలుగా వేయాలి. పిలక దశలో లక్షణాలు కనిపించినప్పుడు ఒక మిల్లీ ప్రొపినో కొనజోల్ లేదా రెండు మిల్లీ లీటర్లు హెక్సా కొనజోల్/లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

**సుడిదోమ లక్షణాలు..**

సుడిదోమ అనేది ఒక కీటకం. ఇది వరి పంటను ఆశిస్తుంది. పురుగులు వరి దుబ్బుల మొదల్లలో చేరి రసాన్ని పీలుస్తాయి.అందువల్ల మొక్కపై భాగానికి పోషక పదార్థాలు అందక ఆకులు పసుపు రంగులోకి మారిపోతాయి. తర్వాత మొక్కలు మొత్తం ఎండిపోతాయి. మొక్కలు సుడులు సుడులుగా పొలంలో అక్కడక్కడ ఎండిపోతాయి. ఈ పురుగు మొదట్లో అక్కడక్కడా ఆశించి వలయ ఆకారంలో పంటను నాశనం చేస్తుంది. పురుగు గ్రేసి స్టంట్, రేడ్జ్ స్టంట్ అనే వైరస్ తెగుళ్లను కూడా వ్యాప్తింపజేస్తుంది.

**వ్యాప్తి..**

రెక్కలున్న సుడిదోమలు పిలకలు వేసే దశలో వరి పైరును ఆశిస్తాయి ఇవి మూడు, నాలుగు వారాల్లో రెక్కలు లేని దోమల్ని ఉత్పత్తి చేస్తాయి. ఆ తరువాత ఇవి రెండో సంతతిని ఉత్పత్తి చేస్తాయి. ఈ దశలో పిల్ల, తల్లి పురుగులు తీవ్రంగా నష్ట పరుస్తాయి. మూడోతరం పురుగులు వృద్ధి చెంది పైరుకు మరింత నష్టం చేస్తాయి. వీటి ఉధృతి ఎక్కువ ఉన్నప్పుడు వరి కంకి వరకు కూడా ఆశించి నష్టాన్ని కలుగజేస్తాయి. సుడి దోమలు ఆకులపై విసర్జించే తేనె లాంటి జిగురు పదార్థం వల్ల మసి తెగులు సోకుతుంది.

**నివారణ..**

ముందుగా వరి పొలంలో ప్రతి 2 మీటర్లకి 20 సెంటీ మీటర్ల కాలి బాటలు తీయాలి. అలాగే పైమెట్రోజెన్ 0.6 గ్రాములు/లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి

**వరి పంటలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి**



వరి పంటలో రైతులు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి. వరిలో ప్రస్తుతం సుడిదోమ, పాము పొడ తెగులను గమనించడం జరిగింది. పాము పొడ తెగులు నివారణకు హెక్సాకొనజోల్ 2మీల్లీ లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని, అలాగే సుడి దోమ నివారణకు ప్రతి 2 మీటర్లకు 20 సెంటి మీటర్లకు కాలి బాటలు తీసుకోవాలని, పైమెట్రోజెన్ 0.6 గ్రాములకు/లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. వ్యవసాయ అధికారులను సంప్రదించాలి. **-కిరణ్, ఏఈవో, రేవోజిపేట క్లస్టర్**

## డయల్ యువర్ డీఎంకు విశేష స్పందన



మాట్లాడుతున్న డీఎం కల్పన

ఆదిలాబాద్ రూరల్, అక్టోబర్ 30: ఆదిలాబాద్ డిపో మేనేజర్ కే కల్పన సోమవారం 'డయల్ యువర్ డీఎం' ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రయాణికులు బస్సు సౌకర్యాలను కల్పించాలని కోరారు. ఉట్నూర్ నుంచి ఎండీ మక్బూల్ ఉదయం 5.30 గంటలకు ఉట్నూర్ నుంచి కరీంనగర్, హైదరాబాద్‌కు బస్సు సౌకర్యం కల్పించమని కోరగా, పై అధికారులకు తెలియజేసి వారి సూచన మేరకు నిర్ణయం తీసుకుంటామని మేనేజర్ తెలిపారు. అలాగే తాంసి మండలం నుంచి వినోద్ ఉదయం 6 గంటలకు ఠాకూర్ హోటల్ నుంచి ఆదిలాబాద్ బస్ స్టేషన్‌కు బస్సు సౌకర్యం కల్పించాలని కోరగా, సానుకూలంగా స్పందించారు. ఆదిలాబాద్ నుంచి ఫాతిమా ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ సర్వీసులకు కామారెడ్డి స్టేజీ వద్ద హాల్ట్ సౌకర్యం కల్పించాలని కోరగా, పైఅధికారులకు చెబుతామని తెలిపారు. ఈ సందర్భంగా మరికొందరు కూడా పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు.

## పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



కాలనీ వాసులతో మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్

ఇచ్చోడ, అక్టోబర్ 30: పరిసరాలను శుభ్రంగా ఉంచాలని జిల్లా పంచాయతీ అధికారి (డీఎల్‌పీవో) శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీతోపాటు వివిధ వీధులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వంద శాతం పన్నులు చెల్లించాలన్నారు. అనంతరం దుకాణాల్లో ప్లాస్టిక్ వాడొద్దని, నాణ్యమైన వస్తువులు విక్రయించాలని సూచించారు. ఆయన వెంట పంచాయతీ ఈవో సూర్యప్రకాశ్, బిల్ కలెక్టర్ రాజేశ్, గ్రామపంచాయతీ సిబ్బంది ఉన్నారు.

## సరఫరాను పునరుద్ధరించాలి

బోథ్, అక్టోబర్ 30: మండలంలోని మర్లపెల్లి గ్రామ సమీపంలో వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు పడి పోయిన విద్యుత్ స్తంభాలను సరిచేసి సరఫరా పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు. వ్యవసాయ కనెక్షన కు సరఫరా అందిస్తున్న విద్యుత్ లైన్లలోని స్తంభాలు నేలకొరిగాయి. పలు చోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు నీటమున గడంతో కాలిపోయాయి. యాసంగి సీజన్ ప్రారంభమై నందున ధికారులు చొరవ తీసుకుని విద్యుత్ సరఫరా ను అందించాలని రైతులు కోరుతున్నారు.



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న అనిల్ జాదవ్

## ఆలయంలో ప్రత్యేక పూజలు

తాంసి, అక్టోబర్ 30: మండల కేంద్రంలో ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా బతుకమ్మల ఉత్సవాల్లో పాల్గొన్నారు. అనంతరం పొన్నారి గ్రామానికి చెందిన ధనశ్రీ, భూదేవి, శంకరయ్య పొన్నారి, గంగన్న, రాజనాల శ్రీహరి ఇటీవలే మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాజనాల శ్రీహరి కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సహాయం అందించారు. వారి వెంట సర్పంచ్‌లు స్వప్న రత్న ప్రకాశ్, అండె అశోక్, బీఆర్ఎస్ నాయకులు అరుణ్‌కుమార్, లింగారెడ్డి, ముచ్చ రఘు, దయానంద్, ఇదపు మహేందర్, మల పతి సుభాష్, పొన్నారి అనిల్ కార్యకర్తలు ఉన్నారు.

## విద్యుత్ ఉద్యోగిపై దాడి.. కేసు నమోదు

ఎదులాపురం, అక్టోబర్ 30: విద్యుత్ శాఖ జూనియర్ లైన్‌మన్‌పై వ్యక్తిపై కేసు నమోదైంది. వన్‌టౌన్ ఎస్ఐ కలీం తెలిపిన వివరాల ప్రకారం.. విద్యానగర్‌కు చెందిన లైన్‌మన్ షేక్ జాకీర్ హుస్సేన్ మసుద్‌చౌక్‌లోని ఆయాన్ హోటల్‌కు సంబంధించిన పెండింగ్ బిల్లు ఉండడంతో సరఫరా నిలిపివేశారు. దీంతో కోపంతో గోర్రు లైన్‌మెన్ తో గొడవకు దిగి, చంపుతానని బెదిరించాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గోర్రుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# ప్రగతిబాటలో 'ఖైర్‌గూడ'


- అభివృద్ధిలో దూసుకెళ్తున్న గ్రామం
- మౌలిక వసతుల కల్పన
- క్రీడా ప్రాంగణం ఏర్పాటుతో యువతకు మేలు

భీంపూర్, అక్టోబర్ 30: భీంపూర్ మండలంలో కొత్త పంచాయతీగా ఏర్పడిన ఖైర్‌గూడ క్రమంగా ప్రగతిబాటలో పయనిస్తున్నది. ఈ పంచాయతీలో ఖైర్‌గూడ, నీంగూడ, రాజులకొరి, రేంగన్‌గూడ అనే గ్రామాలు ఉన్నాయి . మొత్తంగా 540 జనాభా ఉన్నది. ఈ కొలాం గిరిజన పల్లెలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, శాశ్వత అభివృద్ధి పనులతో దూసుకెళ్తున్నాయి. సర్పంచ్ గోవింద్‌రావు, కార్యదర్శి సూర్యకాంత్, అన్ని శాఖల క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో ఇక్కడ ప్రగతి సాకారమవుతున్నది. పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, సమీపంలోనే అందర్‌బంద్ ఆరోగ్య ఉపకేంద్రం, భీంపూర్ పీహెచ్‌సీ అందుబాటులో ఉన్నాయి. ఈ కొలాం ఆవాసంలో ఐటీడీఏ ద్వారా అభివృద్ధి కార్యక్రమాలు అమలవుతున్నాయి. కొలాం గిరిజన రైతులకు తంచసుగా రైతుబంధు అందుతుండగా పెట్టుబడికి మధ్య దళారుల దగ్గరికి వెళ్లడం మానేశారు. కొందరికి పోడు పట్టాలు వచ్చాయి .

**అంతటా ప్రకృతివనాలు , క్రీడా ప్రాంగణాలు**

ఈ పంచాయతీ కేంద్రం సహా అనుబంధ గ్రామాల్లో పల్లె ప్రకృతివనాలు, క్రీడా ప్రాంగణాలు ఉన్నాయి. రాజులకొరిలో నర్సరీ ఉన్నది. హరితహారం కార్యక్రమం సందర్భంలో ఇక్కడినుంచే అన్ని రకాల మొక్కలను పంచాయతీ పరిధి గ్రామాలకు పంపిణీ చేస్తారు. క్రీడాప్రాంగణాలను గిరిజన యువత సద్వినియోగం చేసుకుంటున్నారు. ఇటీవలే ప్రభుత్వం క్రీడా కిట్లను కూడా పంపిణీ చేసింది.

**నాబార్డు డ్రీం ద్వారా జామతోటలు**





గ్రామంలో ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణం



పరిశుభ్రంగా రోడ్లు

నాబార్డు, డ్రీం స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా ఈ కొలాం ఆవాసాల రైతుల చేలలో జామ తోటలను వేయడానికి చేయూతనిచ్చాయి. ఈ మేరకు రైతులకు శిక్షణ ఇచ్చి తోటల సంరక్షణ, సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. ఐటీడీఏ ద్వారా ప్రత్యేక కార్యక్రమాలు అమలవుతున్నాయి . సీఎం కేసీఆర్ శ్రద్ధతోనే తమ పంచాయతీలో అర్హులకు పింఛన్లు ,రైతుబంధు సహా అనేక పథకాలు అమలవుతున్నాయని ఈ సందర్భంగా సర్పంచ్ గోవింద్‌రావు తెలిపారు.

**సీఎం కేసీఆర్‌తోనే గిరిజన గ్రామాలకు మంచి రోజులు**



సీఎం కేసీఆర్ భీంపూర్ ను కొత్త మండలంగా, మా ఖైర్‌గూడను కొత్త పంచాయతీగా చేశారు. అప్పటినుంచే మా మారుమూల గ్రామాలు క్రమంగా అభివృద్ధి చెందుతున్నాయి. అందరికీ భగీరథ నీరు అందుతున్నది. గత ప్రభుత్వాలు ఇక్కడి సమస్యలపై ఎన్నడూ పట్టించుకోలేదు. వైద్యం పరంగా ఎంతో శ్రద్ధ తీసుకుంటున్నారు. పరిశుభత గురించి వైద్యులు గ్రామాలకే వచ్చి అవగాహన కల్పిస్తున్నారు. మునుపటిలా ప్రైవేటు దవాఖానలకు వెళ్లడం లేదు. ఐటీడీఏ అంబులెన్స్ గర్భిణులు,బాలింతలకు 24 గంటలు సేవలందిస్తున్నాయి. సీఎం కేసీఆర్ సార్‌ను మరిచిపోం.

**-గోవింద్‌రావు, సర్పంచ్, ఖైర్‌గూడ .**